పార్కింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : ఏడుపాయల జాతరలో పార్కింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఏడుపాయల వనదుర్గా అమ్మవారి జాతర పార్కింగ్ ప్రణాళికపై సంబంధిత అదనపు కలెక్టర్ నగేశ్, దేవాదాయ, పోలీస్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జాతరలో పార్కింగ్ ఏర్పాట్ల ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా జాతర నిర్వహణ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా మూడు రోజులు పార్కింగ్ నిర్వహణ పకడ్బందీగా జాతర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జాతరలో సింగల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి గ్రామపంచాయతీ ద్వారా చర్యలు తీసుకుంటున్నామి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఏడుపాయల జాతర నిర్వహణ ప్రదేశాలను అధికారులు పరిశీలించుకొని లోటు పాట్లను సవరించుకొని పకడ్బందీగా జాతర నిర్వహించాలన్నా రు. అనంతరం వనదుర్గ అమ్మవారి జాతర నిర్వహణ వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, డీపీవో యాదయ్య, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఏడుపాయల టెంపుల్ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, సంబంధిత పోలీస్, దేవాదాయ, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నారాయణపూర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 13 : వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిధిలోని నారాయణపూర్‌లోని తెలంగాణ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో సౌకర్యాలు వారి భోజన సదుపాయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వహకులు ఎమ్మెల్యేను ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి13 : దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సులభ మార్గంలో నేరాలను శోధించవచ్చని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో కొత్తగా నియామకమైన పోలీస్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మధు సూదన్‌గౌడ్, సీసీటీఎన్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళా సాధికారిత సాధ్యం

మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ అంకిత్ బట్నాగర్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 13 : ఆర్థిక, అక్షరాస్యత ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని ప్రతి మహిళను ఆర్థిక నిపుణురాలుగా మార్చడమే తమ లక్ష్యమని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ అండ్ ఇండస్ట్రీ డైరెక్టర్ డాక్టర్ అంకిత్ భట్నాగర్ అన్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, మహిళా సాధికారత విభాగల సంయుక్త ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ సౌజన్యంతో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ అండ్ ఇండస్ట్రీ ద్వారా మూడు నెలల పాటు నిర్వహించిన 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫైనాన్సియల్ లిటరసీ' ముగింపు సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. ఈ కోర్సు ద్వారా మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడవచ్చన్నారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, ఎఫ్‌టీసీసీఐ రిసోర్స్ పర్సన్ షేక్ సుభానీ, ఐ క్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ తిరుమల్‌రెడ్డి, అధ్యాపకులు హరిత, శరత్‌రెడ్డి, సుధారాణి, రఫీక్, నరేశ్‌గౌడ్, అంజయ్య పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు గురికావద్దు

రామాయంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రామాయంపేట, ఫిబ్రవరి 13 : విద్యార్థులు సైబర్ వలలో పడొద్దని తమ వద్ద సెల్‌ఫోన్ల పట్ల జాగ్రత్తలు పాటించాలని జిల్లా బాలల సంరక్షణ, పరిరక్షణ విభాగం సిబ్బంది మధుకర్, నాగమణి, కవిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ అన్నారు. గురువారం రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలల సంరక్షణ, పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో బేటీబచావో, బేటీ పడావో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ, పరిరక్షణ సమితి సభ్యుల బృందం రమేశ్, మంజుల, సౌందర్య, శ్రీలత తదితరులు ఉన్నారు.

బద్రియ తండాలో తాగునీటి గోస

బద్రియ తండాలో వ్యవసాయ బోరు బావుల నుంచి నీరు తీసుకువస్తున్న మహిళలు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 13 : తాగు నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. చిలిపిచెడ్ మండలంలోని బద్రియ గిరిజన తండాలో మహిళలు తాగు నీటి కోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. తాగు నీటి కోసం తండా వాసులు నానా తంటాలు పడుతున్నారు. తండాలో తాగునీటి సమస్య ఏర్పడడంతో తండా ప్రజలు నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు అధికమయ్యాయి. కనీసం తాగు నీటి సమస్యలపై ఏ అధికారి వచ్చి సమస్య పరిష్కరించడం లేదని, ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు స్పందించి తండా ప్రజలకు నీరు అందించాలని మహిళలు అధికారులను కోరారు.

మెదక్ ఆర్టీవోలో కనీస వసతులు కల్పించాలి

మెదక్ మున్సిపాలిటీ/ మెదక్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : మెదక్ పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో వాహనదారులకు కనీస వసతులు లేవని, తాగడానికి మంచి నీరు ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని బీఆర్‌ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిండ్ల ఆంజనేయులు అన్నారు. ప్రభుత్వానికి వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వేల రూపాయలు పన్ను రూపంలో చెల్లిస్తే రోజుకు లక్షల రూపాయలు చెల్లిస్తున్నా వాహనదారులకు కనీస వసతులు కల్పించకుండా ఎండలో కూర్చో బెట్టడం, వాహనదారులకు కనీస మర్యాద లేకుండా వంద మీటర్ల దూరం వరకు తరిమికొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన ఎండలు మండిపోతున్నందున తక్షణమే ఆర్టీవో వాహనదారులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయాన్ని త్వరలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

నర్సాపూర్, ఫిబ్రవరి 13 : సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలని ఆర్డీవో మహిపాల్ వెల్లడించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం, బంజారా నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 15న ఉదయం నిర్వహించే సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని నర్సాపూర్ తాలుకా పరిధిలో బంజారా నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. బంజారా ఉద్యోగులు సామ్యానాయక్, రామ్‌చందర్, రమేశ్, ధన్‌సింగ్, చక్రుసింగ్, గణేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు శిక్షణ కార్యక్రమం

నర్సాపూర్, ఫిబ్రవరి13 : గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా స్టేజ్-2 అధికారులకు మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో ఉదయం కొల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్ మండలాలు, మధ్యాహ్నం నర్సాపూర్ మండలానికి సంబంధించిన స్టేజ్-2 ఆర్‌ఓలు, ఆర్డీవో మహిపాల్, ఎంపీడీవో మధులత, డీఎల్‌పీవో సాయిబాబా పాల్గొన్నారు.

ఐదు తరగతులు.. ఒకే ఉపాధ్యాయుడు

చండూర్‌లో ఐదు తరగతుల కలిపి ఒకే గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు సతీశ్

చిలిపిచెడ్,ఫిబ్రవరి 13 : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రైవేట్ పాఠశాలలు హంగులు ఆర్భాటాలతో విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించుకునేందుకు పోటీపడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులు లేక చాలా మంది ప్రభుత్వం బడికి వెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. మండలంలోని చండూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు 58 మంది విద్యార్థులు ఉండగా, ఇద్దరే ఉపాధ్యాయులు ఉండగా ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాలకు లాంగ్ లీవ్ పెట్టారు. దీంతో ఒకే తరగతి గదిలో ఐదు తరగతులు బోధించే పరిస్థితి నెలకొన్నది. ఉపాధ్యాయులు లేకపోవడంతో బడికి పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు సుముఖత చూపడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్, డీఈవో, ఎంఈవో పాఠశాలను పరిశీలించి మరో ఉపాధ్యాయుడిని నియమించి పిల్లలకు విద్యను అందించాలని పిల్లల తల్లిదండ్రులు చండూర్ ఉన్నత పాఠశాల కాం ఫ్లెక్స్ హెచ్‌ఎం హరిసింగ్, ఎంఈవో విఠలేను కోరారు.

స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యం

నగరంలో నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

నిజాంపేట, ఫిబ్రవరి13 : ఇంటింటికీ స్వచ్ఛమైన మిషన్ భగీరథ నీటిని అం దించడమే లక్ష్యమని పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆరీఫ్ హుస్సేన్ అన్నారు. నగరంలో వాటర్ ట్యాంకుల నుంచి నల్లాల ద్వారా ఇండ్లకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీటి స్వచ్ఛత (నీటిలో అవశేష క్లోరిన్ శాతం) పరీక్షలను గురువారం భగీరథ సిబ్బందితో చేయించామని కార్యదర్శి తెలిపారు. తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్ భగీరథ సిబ్బంది పరుశరాములు, గ్రామస్తులు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ ప్రకటన విడుదల

సమావేశం నిర్వహిస్తున్న ఎంపీవో విఘ్నేశ్వర్

వెల్దుర్తి, ఫిబ్రవరి 13 : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్‌ను ప్రకటించడంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు ఎంపీవో విఘ్నేశ్వర్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన మాసాయిపేటలో అన్ని పార్టీల మండలాధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించిన ఎంపీవో మాట్లాడారు. నూతన మాసాయిపేట మండలంలో వెల్దుర్తి మండలం నుంచి వేరుపడిన మాసాయిపేట, అచ్చంపేట, కొప్పులపల్లి మూడు ఎంపీటీసీ స్థానాలతో పాటు నూతనంగా మాసాయిపేట-2 ఎంపీటీసీ స్థానం కొత్తగా ఏర్పాటైందని ఎంపీవో తెలిపారు. చేగుంట మండలం నుంచి వచ్చిన పోతన్‌పల్లి ఎంపీటీసీ స్థానం కలిపి మాసాయిపేట మండలంలో మొత్త 5 ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు అయ్యాయని, ఇందుకు మండలంలో 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీవో వివరించారు. వాటికి సంబంధించిన డ్రాఫ్ట్‌ను పబ్లిష్ చేశామని ఎంపీవో పార్టీల నాయకులకు వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ మండలాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు క్రిష్టారెడ్డి, సిద్ధిరాములుగౌడ్, నాగరాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

డి.ధర్మారంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

రామాయంపేట, ఫిబ్రవరి 13 : బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. గురువారం రామాయంపేట మండలం డి. ధర్మారంలో గూడ్‌మియాకు రూ. 13వేలు, నరసవ్వకు రూ.30వేల చెక్కులను అందజేశారు. కాట్రియాల గ్రామంలో మంగ శి బాలమణికి సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



వేడుకల్లో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 13 : నార్సింగి మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. చేగుంట, నార్సింగి మండలాల జర్నలిస్ట్ ఆది సురేందర్ స్వర్ణలతల కుతూరు సాయిసృజ శరత్‌ల వివాహం మండల కేంద్రమైన నార్సింగిలోని చంద్రారెడ్డి గార్డెన్‌లో గురువారం జరిగింది.

ఆర్థిక సాయం అందజేత

కుటుంబాన్ని ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి13 : బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండల పరిధిలోని జంగరాయి గిరిజన తండా చెందిన భీమా మృతి చెందడంతో బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సౌజన్యంతో రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు శంకర్, వాచ్య మైపాల్, చందర్, భాగ్య ఉన్నారు.

లక్ష్మాపూర్ అడవిలో చిరుత సంచారం

రామాయంపేట, ఫిబ్రవరి 13 : రామాయంపేట మండలం లక్ష్మాపూర్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నది. గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన దాసరి పెద్ద ఎల్లయ్యకు చెందిన లేగదూడపై చిరుత దాడిచేసి చంపి తినేసింది. రోజులాగే తెల్లవారుజామున తన పశువుల పాకకు వెళ్లిన రైతు ఎల్లయ్య పాకలో లేగదూడ చనిపోయి పడి ఉన్నది. పశువుల పాక పరిసర ప్రాంతంలో చిరుత అడుగులు కనిపించడంతో ఇది కచ్చితంగా చిరుత దాడి చేసిందని తెలిపారు. కొంత కాలంగా చిరుత పులి అడవి ప్రాంతంలో ఉన్న పశువుల పాక వద్దకు చిరుత వస్తుందని గతంలోనే సంబంధిత అధికారులకు వెల్లడించినట్లు రైతు ఎల్లయ్య తెలిపారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశామని, లేగదూడపై చిరుత దాడి చేయడంతో తనకు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రైతుల ఉపాయం.. జొన్నపంటకు పార్టీ గుర్తు రక్ష

బద్రియ తండాలో ఓ రైతు జొన్న చేనుకు పార్టీ గుర్తులతో రక్ష ఏర్పాటు చేసిన రైతు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 13 : అడవుల సంరక్షణ చర్యలతో అటవీ జంతువుల తాకిడి పెరిగింది. అటవీ ప్రాంతాన్ని అనుకొని ఉన్న పొలాలతో పాటు గ్రామాల సమీపాల్లోని పంటల్లోకి జంతువులు వస్తున్నాయి. జొన్న, మొక్కజొన్న పంటలను అడవి పందులు, మనుబోతులు, కోతులు, పక్షులు ధ్వంసం చేస్తున్నాయి. వాటి బెడద తగ్గించుకునేందకు రైతులు అనేక రకాలుగా అలోచనలు చేస్తున్నారు. అందులో భాగంగా చిలిపిచెడ్ మండలం బద్రియ తండాలో రైతులు పొలాల చుట్టూ వలలు, పాత చీరలు, పార్టీల జెండాలు కడుతున్నారు. కొందరు పంటల మధ్యలో కంచెలు ఏర్పాటు చేసి వాటిపై ఉంటూనే రక్షించుకుంటున్నారు. మరికొందరైతే అరుపులతో కూడిన లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకున్నారు.

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకించాలి

యూపీఎస్‌పై యుద్ధభేరి కరపత్రం ఆవిష్కరిస్తున్న లెక్చరర్లు

మెదక్ మున్సిపాలిటీ/ మెదక్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రం తెలిపారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూపీఎస్‌పై యుద్ధభేరి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానానికి ఆమోదం తెలిపిందన్నారు. ఏకీకృత పెన్షన్ విధానం అనేది కేవలం ఉద్యోగులను మోసగించి, కార్పొరేట్ల కడుపు నింపడానికి వచ్చింది తప్ప ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదని దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైనదని తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్, లెక్చరర్లు శేఖర్, అశోక్, మల్లయ్య, శ్రీనివాస్, కవిత, శశిరేఖ, సరళ పాల్గొన్నారు.

అక్కన్నపేట అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం

రామాయంపేట, ఫిబ్రవరి 13: రామాయంపేట మండలం అక్కన్నపేట అటవీశాఖ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అధికారులు, రైతులు మంటలను ఆర్పేశారు. అనంతరం ఎఫ్ఆర్‌వో విద్యాసాగర్ మాట్లాడుతూ అటవీశాఖలోకి వచ్చే వారు బీడీ, సిగరెట్లు కాల్చవద్దని విలువైన కలప దగ్ధం కావడమే గాక, అడవిలో ఉన్న వన్య ప్రాణులు మృత్యువాత పడుతు న్నాయని తెలిపారు. అటవీశాఖ ఆవరణలో రైతులు, ప్రజలు, గ్రామీణ ప్రాంత వాసులు అడవిపై దృష్టిపెట్టి కాపాడుకుందామన్నారు.

వేధింపులే ఆత్మహత్యకు కారణమంటూ ఫిర్యాదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 13 : వ్యాపారి సాయిదీప్ రమేశ్ ఆత్మహత్యకు అప్పుల వేధింపులే కారణమంటూ భార్య గాయత్రి గురువారం పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. సూపర్ మార్కెట్ యజమాని మల్లికార్జున రమేశ్ ఈనెల 11న ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అప్పుల బాధతో రమేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు కొడుకు సాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పులు ఇచ్చిన వారి వేధింపులే ప్రధాన కారణమంటూ భార్య ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. భర్త రమేశ్ ఈ నెల 11న ఉదయం ఇంట్లో నుంచి బయలుదేరి షాప్‌నకు వెళ్లాడని, అప్పులు ఇచ్చిన వాళ్లు వచ్చి అప్పు ఇస్తావా, చస్తావా, నీ అంతు చూస్తామని బెదిరించారని, అందుకు మనస్తాపం చెంది ఉరివేసుకొని మృతి చెందినట్లు భార్య గాయత్రి ఫిర్యాదులో పేర్కొంది. షాప్ నిర్మాణం కోసం దాదాపు రూ.30 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు తెలిపింది. దుకాణానికి వచ్చి ఎవరు బెదిరించారో షాపులోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.

చోరీ నిందితుడికి రిమాండ్

నర్సాపూర్, ఫిబ్రవరి 13 : ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న నగదు, వెండి అపహరించిన సంఘటన మండల పరిధిలోని ఎర్రకుంటతండాలో చోటు చేసుకుంది.. గురువారం సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎర్రకుంటతండాకు చెందిన ముడావత్ శ్రీను కుటుంబంతో కలిసి ఈ నెల ఒకటిన కట్టెలకని ఇంటికి తాళం వేసి అడవికి వెళ్లారు. అడవి నుంచి ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి దుండగులు తాళం పగలగొట్టి బీరువాలో నగదు, వెండి పట్ట గొలుసులు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ముడావత్ శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అనుమానితుడైన అదే గ్రామానికి చెందిన ముడావత్ అంజ్యాను సీఐ జాన్‌రెడ్డి కానిస్టేబుల్స్ ఉపేందర్, శ్రీకాంత్, హోంగార్డు పోచయ్య పట్టుకొని విచారించగా, అతడి బాబాయి ముడావత్ శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి అడవికి వెళ్లగా ట్రాక్టర్ జాకీ రాడ్‌తో ఇంటి తాళం పగులగొట్టి నగదు, వెండిని దొంగలిచ్చానని ఒప్పుకున్నాడు. దొంగలించిన నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ జాన్‌రెడ్డి వెల్లడించారు. అంజ్యాను అరెస్టు చేసి జుడిషియల్ రిమాండ్‌కు పంపించామని సీఐ జాన్‌రెడ్డి వెల్లడించారు.

నేడు కౌడిపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కౌడిపల్లి, ఫిబ్రవరి 13 : నేడు కౌడిపల్లి మండలంతోపాటు మూడు మండలాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సాయికుమార్ గురువారం తెలిపారు. కౌడిపల్లిలోని సబ్‌స్టేషన్‌లో132 కేవీ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కౌడిపల్లితో పాటు చిలిపిచెడ్, కుల్చారం మండలాలకు సరఫరా నిలిపి వేస్తున్నామని ఇందుకు సహకరించాలని కోరారు.

ఏడుపాయల హుండీ లెక్కింపు

పాపన్నపేట, ఫిబ్రవరి 13 : ఏడుపాయల వన దుర్గాభవానీ ఆలయ హుండీ ఆదాయం రూ. 47.33 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అంజలి దేవి ఆధ్వర్యంలో లెక్కించారు. గురువారం నిర్వహించిన ఈ లెక్కింపులో వెండి బంగారం మినహా 52 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

మహ్మద్ నగర్ సొసైటీ ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

కౌడిపల్లి, ఫిబ్రవరి13 : మండలంలోని ఎరువుల దుకాణాలను గురువారం కౌడిపల్లి డివిజన్ ఏడీఏ పుణ్యవతి మండల వ్యవసాయ అధికారి స్వప్న జాదవ్‌తో కలిసి తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. రైతులకు ఎక్కువ ధరలకు విక్రయించవద్దని సూచించారు. యూరియాను తక్కువ మోతాదులో వాడాలని, ఎక్కువ మోతాదులో వాడినట్లయితే వరిలో కాండం తొలుచు పురుగు అధికమై దిగుబడి తగ్గుతుందని రైతులు సిపారస్సు మేరకు యూరియా వాడాలని సూచించారు.

అంబేద్కర్‌కు నివాళి

రామాయంపేట, ఫిబ్రవరి 13 : ఎస్సీ వర్గీకరణకు తాము పూర్తి వ్యతిరేకమని మాలమహానాడు యువజన సంఘం సభ్యులు పేర్కొన్నారు. గురువారం రామాయంపేట మాలమహానాడు యువజన సంఘం ఆధ్వర్యంలో మెదక్ చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేడు మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగే బంద్‌కు పట్టణంలో ఉన్న విద్యా వ్యాపార, వాణిజ్య వ ర్గాలు తమకు పూర్తి మద్దతు తెలుపాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనే వర్గీకరణ జరిపేది లేదంటు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలి

శివ్వంపేట, ఫిబ్రవరి 13 : స్థానిక సంస్థల ఎన్నికల్లో గర్భిణులకు ఎన్నికల డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్షుడు చక్రుసింగ్ అన్నారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు చక్రుసింగ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో స్టేజ్ 2 ఆఫీసర్స్ డ్యూటీ వేయడంలో సీనియార్టీని ప్రాతిపదికగా తీసుకోవాలని, గర్భిణులకు ఎలక్షన్ డ్యూటీకి మినహాయింపు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంఈవో బు చ్యానాయక్‌కు, ఎంపీడీవో నాగేశ్వర్‌గుప్తాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కనకరాజు, ఉపాధ్యాక్షుడు రాజేంద్రప్రసాద్, ఎఫ్‌డబ్ల్యూఫ్ కన్వీనర్ సంతోశ్, జిల్లా నా యకులు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇసుక డంపుల సీజ్

పాపన్నపేట, ఫిబ్రవరి 13 : పాపన్నపేట మండల పరిధిలోని ఎంకేపల్లిలో అక్రమంగా నిల్వచేసి ఉంచిన ఇసుక డంప్‌లను గురువారం సీజ్ చేసినట్లు పాపన్నపేట ఏఎస్సై సంగన్న వెల్లడించారు. ఇందులో సుమారు 14 ట్రాక్టర్ల ఇసుక ఉంటుందని ఆయన వెల్లడించారు.

పుస్తెమట్టెలు అందజేత

పాపన్నపేట, ఫిబ్రవరి 13 : మండల పరిధిలోని కొత్తగ్రామానికి చెందిన శేరి రాజేందర్-పద్మ కూతురు సాయి ప్రియ వివాహానికి మాజీ సర్పంచ్ కుమ్మరి జగన్ పుస్తె మట్టెలు అందజేశారు. బీఆర్‌ఎస్ నేత దుర్గాప్రసాద్, మాజీ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు టప్ప భూమేశ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సాయిరి రామకృష్ణ, గ్రామ మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కుర్మ యాదగిరి, గడ్డం రాజు, ముద్దెల భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

నర్సాపూర్, ఫిబ్రవరి13 : కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి కుంటలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కాజీపేట్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట్ గ్రామానికి చెందిన కొత్త గౌండ్ల దశరథగౌడ్ (34) గ్రామ సమీపంలోని వీరన్న కుంట వద్దకు కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కుంటలో పడి దశరథగౌడ్ మృత్యువాత పడ్డాడు. దశరథగౌడ్ మృతితో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
GOLD FINANCE
★ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308_All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.